సాక్షి
కుమురం భీం

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



జీవాల పెంపకానికి చేయూత

మాంసం ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం జీవాల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. గొర్రెలు, మేకల పెంపకానికి ఔత్సహికులకు సబ్సిడీపై రుణాలు అందజేస్తోంది. 8లో▸



బడులకు కొత్త వంటపాత్రలు

సర్కారు పాఠశాలల్లో వంటకష్టాలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. మధ్యాహ్న భోజన కార్మికులకు కొత్త వంట పాత్రలు అందించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.8 /26.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు వేడి సెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్‌

21న ఆలయ భూముల కౌలుకు వేలం

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథస్వామి ఆలయానికి చెందిన భూములను ఏడాదిపాటు(1- 6- 2025 నుంచి 31- 5- 2026) సాగు చేసుకునేందుకు ఈ నెల 21న ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి వేణుగోపాల్‌ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 89 ఎకరాల 33 గుంటల వ్యవసాయ భూమి అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్‌ పాసుపుస్తకం జిరాక్స్‌తోపాటు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలు ఇవ్వాలని, రూ.50వేల ధరావత్తు సొమ్ము ముందుగానే చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 96183 07962, 99088 67600 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆయుర్వేద వైద్యశిబిరం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్‌ క్లబ్‌లో బుధవారం సింగరేణి సేవా సమితి, మాతా రీసెర్చ్‌ సెంటర్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్‌ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అనేక రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, గోలేటి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న రమేశ్‌

కెరమెరి(ఆసిఫాబాద్‌): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌ రాథోడ్‌ రమేశ్‌ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం డీఎంహెచ్‌వో సీతారాంను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆస్పత్రులు ఏర్పాటు చేసినా సిబ్బంది, డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కెరమెరి పీహెచ్‌సీకి వైద్యం కోసం వెళ్తే.. అక్కడ ఎవరూ లేని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు నైతం మోహన్‌, నైతం భానుచందర్‌, చౌరే మహేశ్‌ ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్‌: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని జిల్లా ఫైర్‌ అధికారి సురేశ్‌కుమార్‌ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణ, అరికట్టడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 'అగ్ని నివారణపై అవగాహన పెంచుదాం.. సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో ఈ నెల 14 నుంచి 20 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్‌ ఆవిష్కరించారు. లీడింగ్‌ ఫైర్‌మెన్‌ శ్రీనివాస్‌, డీవోపీలు నర్సింగ్‌, రమేశ్‌, ఫైర్‌మెన్లు స్వామి, శరత్‌, శివకుమార్‌, నరేశ్‌, హోంగార్డులు రాము, జనార్దన్‌, తులసీదాస్‌ ఉన్నారు.

18 నుంచి ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఈ నెల 18 నుంచి 22 వరకు ఉచిత వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఎలక్ట్రానిక్స్‌, రోబోటిక్స్‌ కోడింగ్‌, ప్రోగ్రామింగ్‌, మ్యాథమెటిక్స్‌, ఫిజిక్స్‌కు సంబంధించిన అనేక ప్రాజెక్టులపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరుకావొచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ల్యాబ్‌ ఇన్‌చార్జి సైదం శ్రీకాంత్‌(97032 64496), ప్రధానాచార్యులను సంప్రదించాలని సూచించారు.

ఎదుగని చేప!



ఇవి ఆసిఫాబాద్‌ జిల్లా పెంచికల్‌పేట్‌ మండలం చేడ్వాయి చెరువులోని చేపలు. ఈ చెరువులో గత సెప్టెంబర్‌లో ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చిన 50వేల చేప విత్తనాలు విడుదల చేశారు. ఈ సమయానికి కిలోన్నర వరకు బరువు ఉండాలి. కానీ అరకిలో వరకే ఉన్నాయి.

- నాసిరకం విత్తనంతో నష్టాలు
- బరువు పెరగని సబ్సిడీ చేపలు
- మత్స్యకారులకు తగ్గిన దిగుబడి
- ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి



అరకిలో లోపే ఉన్న చేపలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వందశాతం సబ్సిడీతో చేప విత్తన పంపిణీ లక్ష్యం నీరుగారిపోతోంది. అదునులోపు చేప విత్తనం పంపిణీ చేయకపోవడం ఒక కారణమైతే.. నాసిరకం విత్తనాలతోనూ మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈసారి లక్ష్యం కంటే సగానికి తక్కువగానే చేపపిల్లలను నీటిలో వదిలారు. వర్షాకాలం ఆరంభంలో కాకుండా సెప్టెంబర్‌ నుంచి డిసెంబర్‌ వరకు విడుదలలో జాప్యం జరిగింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 994నీటి వనరుల్లో లక్ష్యం ప్రకారం 6కోట్లకు పైగా చేపపిల్లలను వదలాల్సి ఉన్నా 3.57 కోట్ల చేపపిల్లలు వదిలారు. రవు, బొచ్చె రకాలు ఎక్కువగా ఉన్నాయి. 35ఎంఎం నుంచి 40ఎంఎం, 80నుంచి 100ఎంఎం పరిమాణం ఉన్న చేపపిల్లలను వదిలారు. అయితే అవి ఆశించిన స్థాయిలో ఎదుగక సరైన దిగుబడి రాలేదు. కొన్ని చోట్ల మత్స్యకార సంఘాల సభ్యులే సొంత డబ్బులతో చేపపిల్లలు కొనుగోలు చేసి పెంచుతున్నారు. మంచిర్యాల జిల్లాలో జిల్లాలో మొత్తం 372చెరువుల్లో 1.09కోట్ల చేపపిల్లలకు గాను 47చెరువుల్లోనే 2.99లక్షల చేప పిల్లలు వదిలారు.

జాప్యం.. నాసిరకం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో రూ.లక్షలు వెచ్చించి, చేపపిల్లలను కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచి అప్పగించింది. గత సర్కారు హయాంలో భారీగా అవకతవకలు జరిగాయని కొన్ని చోట్ల ఒప్పందాలు రద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇచ్చారు. అయినా విత్తనంలో నాణ్యత లేక చాలా చోట్ల లక్ష్యం మేర చేపలు బరువు పెరగలేదు. అదే సమయంలో ప్రైవేటుగా కొనుగోలు చేసిన, చేప విత్తనాలు మాత్రం బరువు పెరిగినట్లుగా చెబుతున్నారు. ఏటా వానాకాలంలో చేప విత్తనాలను ఎల్లంపల్లి, అడ(కుమురం భీం), కడెం, పీపీ రావు, సాత్నాల, స్వర్ణ, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలీ తదితర ప్రాజెక్టుల్లో వదులుతున్నారు. ఈసారి ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువుల్లోనూ ఆశించిన మేర దిగుబడి లేదని మత్స్యకారులు వాపోతున్నారు.



వల విసురుతున్న మత్స్యకారుడు

నాసిరకంగా ఉన్నాయి..



గతేడు కంటే ఈ ఏడాది చేప విత్తనాలు నాసిరకంగా ఉన్నాయి. ప్రభుత్వం చేప విత్తనాలకు బదులు నేరుగా డబ్బులు సొసైటీ సభ్యులకు జాయింట్‌ ఖాతాల్లో వేస్తే మేమే విత్తనాలను కొనుగోలు చేసుకుంటాం.

– పుట్టి నర్సయ్య, నర్సాపూర్‌(డబ్ల్యూ), లక్ష్మణచాంద మండలం, నిర్మల్‌ జిల్లా

ఆ రైలు 20గంటలు ఖాళీ..!

- నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు కాజీపేట జంక్షన్‌ వరకు పొడగిస్తే మేలు
- ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రయాణికులకు రవాణా సౌకర్యం
- ఎంపీలు స్పందించాలని రైల్వే ప్రయాణికుల విజ్ఞప్తి

బెల్లంపల్లి: ముంబయి ఛత్రపతి శివాజీ టెర్మినల్‌ నుంచి బల్లార్షా వరకు నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు(నం.11001/2) వయా నాందేడ్‌, ఆదిలాబాద్‌ మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ రైలును వరంగల్‌ జిల్లా కాజీపేట జంక్షన్‌ వరకు పొడగించాలనే డిమాండ్‌ కొంతకాలంగా వినిపిస్తోంది. ఉత్తర తెలంగాణ ప్రజలు మహారాష్ట్ర రాజధాని ముంబయి వెళ్లడానికి సరైన రైలు ప్రయాణ సౌకర్యం లేకుండా పోయింది. కాజీపేట, హైదరాబాద్‌ వెళ్తే గానీ ముంబయికి వెళ్లే పరిస్థితులు లేవు. ప్రస్తుతం ముంబయి నుంచి బల్లార్షా జంక్షన్‌ వరకు నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ నడుస్తోంది. ఆ రైలును కాజీపేట జంక్షన్‌ వరకు పొడగించడం వల్ల రైల్వేపై ఏ మాత్రం భారం పడకపోగా ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని ప్రయాణికులకు ఎంతగానో మేలు జరిగి రవాణా సౌకర్యం మెరుగవుతుంది.

సమయం సద్వినియోగం చేసుకుంటే..

ముంబయి ఛత్రపతి శివాజీ టెర్మినల్‌ నుంచి బయల్దేరిన నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు వయా నాందేడ్‌, ఆదిలాబాద్‌ మీదుగా బల్లార్షా జంక్షన్‌కు చేరుకుంటుంది. ఆ తర్వాత అక్కడే దాదాపు 20గంటలపాటు ఖాళీగా ఉంటుంది. ఆ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కాజీపేట జంక్షన్‌ వరకు పొడగిస్తే కాజీపేట–బల్లార్షా సెక్షన్‌ పరిధిలో ఉన్న సిర్పూర్‌ కాగజ్‌నగర్‌, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట తదితర ప్రాంతాల ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉండడంతోపాటు రైల్వేకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల ప్రజలకు ముంబయి వెళ్లడానికి ఒక్క రైలు సౌకర్యం కూడా లేదు. దీంతో ముంబయి వెళ్లాల్సిన ప్రయాణికులు కాజీపేట జంక్షన్‌కు వెళ్లి కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ లేదా విశాఖ నుంచి ఎల్‌టీటీ ద్వారా వెళ్లాల్సి వస్తోంది. అదీ సాధ్యం కాకపోతే నిజామాబాద్‌ జంక్షన్‌కు వెళ్లి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ముంబయి వెళ్లాల్సిన ప్రతికూల పరిస్థితులు ఉంటున్నాయి. నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట జంక్షన్‌ వరకు పొడగించిన తర్వాత కూడా మరో 11గంటలపాటు రైలు ఖాళీగా ఉండే అవకాశాలు ఉండనున్నాయి. అక్కడ ప్రాథమిక నిర్వహణకు అవకాశం ఉంటుంది. ప్రసుత్తం కాజీపేటలో రెండు ఫిట్‌లైన్లు అందుబాటులో ఉండడం కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. కాగా, ఆదిలాబాద్‌ జిల్లా ప్రయాణికులకు వరంగల్‌ జిల్లా మరింత చేరువవుతుంది.

ఎంపీలు స్పందిస్తే ఎంతోమేలు

నందిగ్రామ్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు పొడగింపు కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి ఎన్నికైన ఎంపీలు స్పందించాల్సిన అవసరం ఎంతగానో ఉంది. బల్లార్షా జంక్షన్‌ నుంచి కాజీపేట జంక్షన్‌ వరకు పొడగించే ప్రయత్నాలు చేయాలి. దీంతోపాటు పెద్దపల్లి నుంచి నిజామాబాద్‌ రైల్వే మార్గంలో వారానికి మూడు రోజులు ముంబయికి రైలు నడపడంతోపాటు బల్లార్షా–వార్ధా మార్గంలో నూతన వీక్లీ సర్వీసు ప్రవేశ పెడితే ఉత్తర తెలంగాణ ప్రయాణికులకు ముంబయి వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. ఈ ప్రాంత ఎంపీలు చిత్తశుద్ధితో కృషి చేయాలని రైలు ప్రయాణికులు కోరుతున్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి



కరోనా కంటే ముందు నడిపించిన ఆనంద్‌వన్‌(రైలు నెం.22127/28) సూపర్‌ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలును అర్ధంతరంగా రద్దు చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పునః ప్రారంభించలేదు. ఈ రైలు కాజీపేట జంక్షన్‌ నుంచి బయల్దేరి లోకమాన్య తిలక్‌ టెర్మినల్‌ వయా బల్లార్షా, వార్ధా, అమరావతి, అకోలా భుసావల్‌, మన్మాడ్‌ మీదుగా ముంబయి వెళ్లేది. ఈ రైలు వల్ల ప్రయాణ సమయం తక్కువగా ఉండి ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. కానీ ఈ రైలు నిలిపివేయడం వల్ల ముంబయి వెళ్లే ఉత్తర తెలంగాణ ప్రయాణికులకు కష్టాలు పెరిగాయి.

భూభారతితో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: భూభారతి నూతన ఆర్‌వోఆర్‌ చట్టం ద్వారా భూసమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, ఎం.డేవిడ్‌, కాగజ్‌నగర్‌ సబ్‌ కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గృహనిర్మాణ శాఖ, మిషన్‌ భగీరథ ఇంజనీరింగ్‌ శాఖల అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అర్హుల జాబితా, ఎంపిక, తాగునీటి సరఫరా అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తాగునీటి సరఫరాపై సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులతో కలిసి హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారని తెలిపారు. నూతన భూభారతి చట్టంలోని అంశాలపై అధికారులకు అవగాహన ఉండాలని సూచించారు. పైలట్‌ గ్రామాల్లో నమూనా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇతర గ్రామాల్లో అర్హుల జాబితాను ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. అత్యంత పేదవారిని గుర్తించి వారికి ప్రాధాన్యతనివ్వాలని, అనర్హులు జాబితాలో లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిషన్‌ భగీరథ పథకంలో నల్లా కలెక్షన్‌ ద్వారా నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలకు వాటర్‌ ట్యాంకులు, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరా చర్యలు చేపట్టాలన్నారు. పైప్‌లైన్‌ లేని గ్రామాలను గుర్తించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని నిరసన

ఆసిఫాబాద్‌రూరల్‌: బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట మంగళవారం కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ వసతిగృహాల్లో ఔట్‌సోర్సింగ్‌ వర్కర్లకు 12 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతినెలా నిత్యావసర వస్తువులు, అత్యవసర ఖర్చులకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.13,600 నెలసరి జీతంతో బతుకుతున్న కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌ ప్రతినెలా చెల్లించాలని డిమాండ్‌ చేశారు. సమస్య పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జగజంపుల తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల, పోషక్క, సరోజ, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

మే 20న దేశవ్యాప్త సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్‌: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న దేశవ్యాప్త సమ్మె చేపట్టినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్‌, టీయూసీఐ జిల్లా కార్యదర్శి తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్‌ కోడ్‌లు వెంటనే రద్దు చేసి, కార్మికులు పోరాటలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను సైతం రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌, ఆర్టీసీ రిటైర్డ్‌ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

యువ వికాసానికి స్పందన

- ఈ నెల 14 వరకు 28,116 దరఖాస్తులు

కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు

ఎస్సీ	6,836
ఎస్టీ	7,233
బీసీ	12,096
మైనార్టీ	1,918
క్రిస్టియన్‌	33
మొత్తం	28,116



ఆసిఫాబాద్‌లోని మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు(ఫైల్‌)

ఆసిఫాబాద్‌అర్బన్‌: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికోసం రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్‌ యువ వికాసం పథకానికి జిల్లాలో స్పందన వచ్చింది. నిరుద్యోగులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. పలుమార్లు సర్వర్‌ సమస్యలు తలెత్తినా ప్రజాపాలన కేంద్రాలు, మీసేవ కేంద్రాల వద్ద క్యూలైన్లు కట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్‌ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగలకు సబ్సిడీపై రుణాలు అందించనుంది. మొదట ఈ నెల 5 వరకు గడువు నిర్ణయించారు. అయితే సర్వర్‌ సమస్యలు, దరఖాస్తుదారులు కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాలు పొందడంలో తీవ్ర జాప్యం జరగడం.. అలాగేఏ యూనిట్‌కు అప్లై చేసుకుంటే ఎంత మొత్తం రుణం మంజూరు చేస్తారో నిర్ణయం కాకపోవడంతో చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు వెనుకడుగు వేశారు. ఆ తర్వాత ప్రభుత్వం గడువును ఈ నెల 14 వరకు పొడిగించింది. ఇప్పటివరకు జిల్లాలో 28,116 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

అదృష్టం ఎవరికో..

రాజీవ్‌ యువ వికాసం పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యువతతోపాటు పలువురు రైతులు మండల కేంద్రాలతోపాటు ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ పట్టణాలోని మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తులు సమర్పించారు. ఇటీవల వరుసగా సెలవులు వచ్చినా ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఈ కేంద్రాలను తెరిచి ఉంచారు. మున్సిపల్‌, మండల కమిటీలు దరఖాస్తులను పరిశీలించి జిల్లా కమిటీకి సమర్పించనున్నారు. జిల్లా కమిటీలోని సభ్యులు జాబితాను పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేయనున్నారు. జిల్లాలో ఎస్సీ వర్గానికి 2,185 యూనిట్లు, బీసీ వర్గానికి చెందిన వారికి 1,845 యూనిట్లు, ఎస్టీ సామాజిక వర్గానికి 3,855 యూనిట్లు కేటాయించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. రూ.50వేల యూనిట్లకు వందశాతం రాయితీ ఉండటంతోపాటు బ్యాంకులతో నిమిత్తం లేకుండా రుణం మంజూరవుతుంది. అలాగే వెరిఫికేషన్‌ ప్రక్రియ కూడా వేగంగా పూర్తవుతుంది. మైనార్టీ విభాగానికి సంబంధించి యూనిట్లు ప్రభుత్వం నుంచి మంజూరవుతాయి.

– అబ్దుల్‌ నదీం, డీఎండబ్ల్యూవో

పాఠశాలల్లో సర్వే షురూ



సర్వే చేస్తున్న ఛాత్రోపాధ్యాయిలు

ఆసిఫాబాద్‌రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడంతోపాటు యూడైస్‌ ప్లస్‌ పోర్టల్‌లో వివరాలు సరిచూసేందుకు జిల్లాలో మంగళవారం నుంచి సర్వే ప్రారంభమైంది. జిల్లా ప్లానింగ్‌ కోఆర్డినేటర్‌ అబిద్‌ అలీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 591 పాఠశాలల్లో 61 మంది ఛాత్రోపాధ్యాయులు ఈ నెల 21 వరకు సర్వే చేస్తారని తెలిపారు. తొలిరోజు 126 పాఠశాలల్లో వివరాలు సేకరించామని వెల్లడించారు. గతంలో హెచ్‌ఎంలు యూడైస్‌ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా.. లేదా అని పరిశీలించి తప్పులు ఉంటే సరిచేసి కార్యాలయంలో అందజేస్తారని పేర్కొన్నారు.

నీటి కుంటల ఏర్పాటుకు శ్రీకారం



పనులు పరిశీలిస్తున్న జీఎంలు సూర్య నారాయణ, సైదులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): జల వనరులను పెంపొందించాలనే లక్ష్యంతో సింగరేణి యాజమాన్యం నీటి బిందువు –జల సింధువు కార్యక్రమంలో భాగంగా నీటి కుంటల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని సివిల్‌ జీఎం సూర్యనారాయణ, ఎన్విరాన్‌మెంట్‌ జీఎం సైదులు తెలిపారు. జనరల్‌ మేనేజర్‌ విజయ భాస్కర్‌ రెడ్డి ఆధ్వర్యంలో జలవనరుల పెంపు కోసం బెల్లంపల్లి ఏరియాలో చేపట్టిన నీటి కుంటల ఏర్పాటు పనులను మంగళవారం పరిశీలించారు. గోలేటి గ్రామ శివారులోని పంట పొలాల వద్ద చేపట్టిన నీటి కుంటల పనులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. సింగరేణి సంస్థ చేపట్టిన కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్‌ ఎస్‌కే మదీనా బాషా, ఎన్విరాన్‌మెంట్‌ అధికారి హరీశ్‌, ఏరియా ఎస్టేట్స్‌ అధికారి సాగర్‌, ఈఈ సివిల్‌ మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది మంది బైండోవర్

నెన్నెల(బెల్లంపల్లి): పేకాడుతూ పట్టుబడిన ఐదుగురిని, గంజాయి సేవిస్తూ పట్టుబడిన మరో నలుగురిని మంగళవారం తహసీల్దార్ మహేంద్రనాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇకపై మంచి మార్గంలో నడుచుకోవాలని వారికి సూచించినట్లు పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించి ఇదే నేరాన్ని మరోసారి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కడెం(ఖానాపూర్): మండలంలోని లింగాపూర్‌లో పడాల గంగవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. గంగవ్వ ఇటీవల మండలంలోని పాత మద్దిపడగలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లింది. ఈనెల 14న రాత్రి దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మంగళవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు వృద్ధురాలికి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్లూస్‌టీం సిబ్బంది ఇంటిని పరిశీలించారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలను పగులగొట్టి మూడు తులాల బంగారం, పది తులాల వెండి కడియాలు, రూ.15 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్‌చాందలో..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఈ నెల 13న లక్ష్మణ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చే చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సామగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో ఉన్న 3 తులాల బంగారం, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్‌లో రెండిళ్లలో..

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ కాలనీలో గల షేక్ సాబీర్ ఈనెల 14న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. అదే ఇంటిపక్కన ఉన్న మహ్మద్ అన్వర్ అహ్మద్ ఇంటితాళం పగులగొట్టిన దొంగలు బీరువాలోని రూ.6వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు గాలింపు చేపట్టారు.

జీవాల పెంపకానికి చేయూత

- ఎన్ఎల్ఎం ద్వారా రుణాలు
- యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ
- గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు మంజూరు

యూనిట్ సబ్సిడీ

(గొర్రెలు,పొట్టేళ్లు)	(రూ.లక్షల్లో)
500-25	50
400-40	40
300-15	30
200-10	20
100-05	10



లక్ష్మణచాందలో గొర్రెల మంద

లక్ష్మణచాంద(నిర్మల్): దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాంసం ఉత్పత్తులు పెంచాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. మాంసానికి ఉన్న డిమాండ్ దృష్ట్యా జీవాల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకల పెంపకానికి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీం(ఎన్ఎల్ఎం) ద్వారా ఔత్సాహికులకు సబ్సిడీ రుణాలు అందిస్తోంది. 2021–22లో ప్రారంభించిన ఈ పథకాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది. ఈ పథకం కింద పెంపకందారులకు ఒక్కో యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. యూనిట్ మంజూరైనప్పటి నుంచి పూర్తిస్థాయిలో సబ్సిడీ నిధులు విడుదలయ్యే వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షిస్తుందని అధికారులు తెలిపారు. గరిష్ఠంగా యూనిట్‌కు రూ.50 లక్షల వరకు రుణం అందించనున్నారు. ఈ రుణం డబ్బులను రెండు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

దరఖాస్తు ఇలా..

గొర్రెలు,మేకల యూనిట్ల పెంపకం రుణం మంజూరు కోసం www. nim. udyamimitra. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఈ రుణాలు పొందడానికి దరఖాస్తు చేయడానికి ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని అధికారులు అంటున్నారు. రుణం మంజూరుకు దరఖాస్తు చేస్తున్న ఉత్సాహవంతులు తమ పాన్, ఆధార్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, పాస్‌ఫొటో, రుణం తీసుకునే బ్యాంకు స్టేట్‌మెంట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.

అర్హతలు

1. కనీసం ఐదెకరాల వ్యవసాయ భూమిని కలిగి ఉండాలి. ఇతరులదైనా లీజుకు తీసుకోవాలి.
2. పశు పోషణలో తగిన అనుభవం ఉండాలి.
3. యూనిట్ మంజూరు కోసం బ్యాంక్ కాన్‌సెంట్ తీసుకోవాలి.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకంపై ఆసక్తి ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలి. ఈ దరఖాస్తు చేసుకుని యూనిట్ పొంది ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలి.

– ఎండీ బాలిగ్ అహ్మద్, జిల్లా పశువైద్యాధికారి, నిర్మల్

పెళ్లి ఘడియలు

- మూడు నెలలపాటు శుభ ముహూర్తాలు



దండేపల్లి(మంచిర్యాల): ముహూర్తాల కోసం వేచి చూస్తున్న వారికి తీపి కబురు అందింది. మండు వేసవిలో శుభఘడియలు వచ్చాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో తెలుగింట 'రారండోయ్..వేడుక చేద్దాం' అంటున్నారు. వరుసగా మంచిరోజులు రావడంతో పెళ్లి మండపాలు, బ్యాండ్ మేళాలకు డిమాండ్ ఏర్పడింది. పురోహితులు, వంట మనుషులు, వీడియోగ్రాఫర్లకు, ఆర్డర్లు తలుపు తడుతున్నాయి.

ముహూర్తాలు ఇవే..

ఏప్రిల్‌లో 16, 18, 20, 23, 30 తేదీల్లో, మే నెలలో 1, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 21, 23, 28, 30, 31 తేదీల్లో, జూన్ నెలలో 2, 4, 5, 6, 7, 8 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. జూన్ 11 నుంచి జూలై 12 వరకు మూఢం రావడంతో ముహూర్తాలకు కొంత విరామం వచ్చింది. తిరిగి మళ్లీ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు మొదలు కానున్నాయి. ఏదిఏమైనా ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సరంలో శుభముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో పెళ్లిళ్లు కూడా ఎక్కువగానే జరుగనున్నాయి.

మూణ్నెళ్లు శుభఘడియలు



మూడు నెలలపాటు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు జరుపుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా ఈ నెల 30న అక్షయ తృతీయ రావడంతో ఆరోజు దివ్యమైన ముహూర్తం ఉంది. నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నవారు వేడుకలకు సిద్ధమవుతున్నారు.

– గొల్లపెల్లి రామానందాచార్య స్వామి, వేదపండితులు

ఆర్టీసీ డ్రైవర్‌కు 18 నెలల జైలు

శ్రీరాంపూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు 18 నెలల జైలుశిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు జడ్జి డీ.ఉపనిషధ్వని మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సంతోశ్ తెలిపారు. 2017, నవంబర్ 06న శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న పోతనవేణి మల్లమ్మను ఏ.సంతోశ్‌కుమార్ అజాగ్రత్తగా బస్సు నడుపుతూ ఢీకొట్టాడు. గాయపడిన మల్లమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కటిక రవిప్రసాద్ కేసు నమోదు చేశారు. మంగళవారం 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

గుండెపోటుతో సింగరేణి అధికారి మృతి



కే.చిరంజీవులు (ఫైల్)

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని ఐఈడీ విభాగం డీజీఎం కే.చిరంజీవులు గుండెపోటుతో మృతిచెందారు. సోమవారం సాయంత్రం ఇల్లందు క్లబ్‌లో షటిల్ ఆడి ఇంటికి వెళ్లి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా సోఫాలో కుప్పకూలిపోయారు. తీవ్ర చెమటలు వచ్చిన ఆయనను భార్య జ్యోతి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు పరామర్శించారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల ప్రాంతానికి తీసుకెళ్లారు. చిరంజీవికి భార్య జ్యోతి, కుమారుడు వినీత్, రోహిత్ ఉన్నారు. వినీత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రోహిత్ జార్జియ దేశంలో వైద్య విద్య అభ్యసిస్తున్నారు. నిత్యం షటిల్ ఆటతోపాటు ఎంతో ఫిట్‌గా ఉండే చిరంజీవులు గుండెపోటుతో మృతిచెందడం అధికారులు, కార్మికుల్లో తీవ్ర విషాదం నింపింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నస్పూర్: పట్టణ పరిధిలోని దొరగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి తెల్లవారుజామున దొరగారి పల్లె వద్ద జాతీయ రహదారి 363 దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. వివరాలకు 8712656539 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విధులకు ఆటంకం.. నలుగురిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లాలోని ర్యాలీ గ్రామంలో ఫారెస్ట్ బీట్ అధికారి విధులకు ఆటంకం కలిగించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బీట్ ఆఫీసర్ మధుకర్ ఈ నెల 13న ర్యాలీ అటవీ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని రేంజ్ ఆఫీస్‌కు తరలిస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్ యజమాని ఎండీ.మునీర్, ఎండీ.నాసర్, ఎండీ బషీర్ అడ్డుకుని బీట్ ఆఫీసర్ మధుకర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని తెలిపారు. మధుకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ అజయ్, మునీర్, నాసర్, బషీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



సంఘటన స్థలంలో రాజు మృతదేహం

దిలావర్‌పూర్(నిర్మల్): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఎల్.సందీప్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన దిద్దోలి రాజు (45) కుటుంబం నర్సాపూర్(జి) మండలంలోని అర్లి వద్ద ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారు జామున రాజు భార్య, ఇద్దరు పిల్లలు ఆటోలో పంపించారు. రాజు, అతని కుమారుడు కేదార్‌నాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుగుప్రయాణంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ సమీపంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందగా కేదార్‌నాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సందీప్ ఘటనా స్థలానికి చేరుకుని కేదార్‌నాథ్‌ను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాహనంలో తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సోన్(నిర్మల్): మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి తెలిపారు. మృతుని వయస్సు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, తల వెంట్రుకలు పొడవుగా ఉన్నాయని, వేసుకున్న బట్టలు మాసిపోయి ఉన్నాయన్నారు. కడ్తాల్ మాజీ సర్పంచ్ బర్మా రాజానర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

సారంగపూర్(నిర్మల్): మండలంలోని యాకర్‌పెల్లి గ్రామానికి చెందిన నిర్మల రాజు(41) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. బెబ్లాలీ ఏరియాలో గల వేదామ్స్ కంపనీలో కూలీపనులు చేస్తున్నాడు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 7న మృతి చెందాడు. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ఎడారి దేశంలో దిక్కుతోచని స్థితిలో జీవి విడిచావు.. ఇక్కడికి వచ్చినా మేము కాపాడుకునేవాళ్లం.. ఇప్పుడు పిల్లలను ఎలా సాకాలయ్యా.. అని మృతుని భార్య రుక్మవ్వ రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతునికి భార్య రుక్మవ్వ, కుమారుడు అఖిల్, కుమార్తె శృతి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దిలావర్‌పూర్ మండలం ఒడ్డేపల్లికి చెందిన కుంచపు సురేష్ తన భార్య గంగామణి, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై కుందాపూర్ ఎల్లమ్మ వద్దకు వెళ్లి వస్తుండగా నర్సాపూర్(జి)కి చెందిన జావేద్, తన కుమారుడితో కలిసి బైక్‌పై దిలావర్‌పూర్ బయలుదేరాడు. మార్గమధ్యలో జాతీయ రహదారిపై సురేష్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఘటనలో గంగామణి, జావేద్, అతని కుమారుడికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

500 దేశీదారు సీసాలు స్వాధీనం



దేశీదారు, నిందితుడితో ఎక్సైజ్ సీఐ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని భీంసరిలో 90 ఎంఎల్ పరిమాణంలో ఉన్న 500 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ మహారాష్ట్రలోని చనాక నుంచి ద్విచక్ర వాహనంపై దేశీదారు తీసుకువస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.18వేలు ఉంటుందన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 54వ సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో 20 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 80 మంది మహిళా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా 20 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మంచిర్యాల జిల్లాలోని మందమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్, పీడీ, పీఈటీలు రవి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



మెమొంటో అందుకుంటున్న రామ్ అక్షరేష్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన నామని రమేశ్ కుమార్, మౌనిక దంపతుల కుమారుడు రామ్ అక్షరేష్ 8 నిమిషాల్లో 300ల పదాలను పఠించడం ద్వారా వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నాడు. ఎల్‌కేజీ చదువుతున్న రామ్ అక్షరేష్ తెలుగు సంవత్సరాలు, నెలలు, తిథులు, రాష్ట్ర రాజధానులు, జాతీయ చిహ్నాలు, గ్రహాలు, ఆవిష్కరణలు, చారిత్రాత్మక కట్టడాలతో సహా 300ల వరకు 8 నిమిషాల్లోనే పఠించడం ద్వారా రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు భారత దేశ ప్రతినిధి బింగి నరేంద్ర గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్లు డాక్టర్ వేణుకుమార్, కే.రవికుమార్ చిన్నారికి మెమొంటో అందజేశారు.

అమ్మా.. క్షమించు

- అన్నయ్యా.. సారీ..
- నా ఆరోగ్యం మెరుగుపడడం లేదు
- బాధ భరించలేకపోతున్నా'
- సూసైడ్ నోట్ రాసి యువకుడి బలవన్మరణం



అనిల్ (ఫైల్)

నెన్నెల(బెల్లంపల్లి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు చికిత్స చేయించుకున్నా మెరుగు పడకపోవడంతో మనస్తాపం చెందాడు. అనారోగ్యం బాధను భరించలేకపోయాడు. ఇక చావే శరణ్యమనుకున్నాడు. ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌లో జరిగింది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాశాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెల్మాటికారి సత్తయ్య, అమృత దంపతుల కుమారుడు అనిల్ (24) పీజీ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా పచ్చకామెర్లు, దవడ బిల్లలు, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లోనే దూలానికి చీరతో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఉరేసుకునే ముందు బెడ్‌రూమ్‌లో అతని మంచంపై సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. 'అమ్మా.. నన్ను క్షమించండి.. నాకు ఆరోగ్యం బాగుండడంలేదు. బాధ భరించలేక చనిపోతున్నా. నా చావుకు ఎవరూ కారణం కాదు. నా సొంత నిర్ణయంతో చనిపోతున్నా. అన్నయ్య సారీ రా... నీవు ఈ లెటర్ చదివే సమయానికి నేను నీతో ఉండను.. అమ్మా నాన్నను కష్టపెట్టకు.. నన్ను మీరంతా క్షమిస్తారని ఆశిస్తూ.. సెలవు తీసుకుంటున్నా.. అని నోట్ రాసి ఉంచాడు. మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం

అనిల్ కళ్లు దానం చేయడానికి తల్లిదండ్రులు ముందుకు వచ్చి సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భీం పుత్ర శ్రీనివాస్, బ్లడ్ డోనర్ అసోసియేషన్ అధ్యక్షుడు రహీమ్‌కు సమాచారం అందించారు. దీంతో వారు హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్‌కుమార్‌కు తెలియజేయడంతో గ్రామానికి వచ్చి నేత్రాలు సేకరించారు.

పోలీసుల పనితీరు భేష్

- 40 నిమిషాల్లోనే దొంగను పట్టుకున్న వైనం



చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఒకరి వద్ద నుంచి రూ.36వేల నగదు అపహరించిన దొంగను కేవలం 40 నిమిషాల్లోనే గుర్తించిన ఆసిఫాబాద్ పోలీసులు భేష్ అనిపించుకున్నారు. సీఐ బుద్దె రవీందర్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రానికి చెందిన మీర్ అలీ మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్ వద్ద తన స్కూటీని పార్కింగ్‌లో చేశాడు. డిక్కీలో ఉన్న రూ.36వేల నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు తిరుపతి, సాగర్ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రవీందర్, ఎస్సై అంజయ్య, బ్లూకోర్ట్ కానిస్టేబుల్ సాగర్, తిరుపతిని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు, సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్త రంజన్ అభినందించారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

దండేపల్లి: మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన కల్లెం సంతోశ్‌పై దాడికి పాల్పడిన లక్కాకుల సృజన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. నర్సాపూర్ సమీపంలోని తాటిచెట్ల వద్ద మొరం డబ్బుల విషయంలో ఇద్దరూ గొడపడ్డారు. ఈక్రమంలో మాటామాట పెరగడంతో సంతోశ్‌పై సృజన్ కర్రతో దాడిచేయడంతో గాయాలయ్యాయి. బాధితుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూల్చిన ఇద్దరికి జైలుశిక్ష

మంచిర్యాలక్రైం: ప్రహరీ, పైపులైన్, గేట్లు కూల్చివేసిన ఇద్దరికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో నివసించే లక్సెట్టి మల్లయ్య, అప్పాసు కిషన్, నెల్కి మల్లేశ్, బీ.కిషన్‌కు సంబంధించిన ప్రహరీ, గేట్లు, పైపులైన్‌ను సదానంద గౌడ్, సురేష్ 2020 జూన్1న జేసీబీతో ధ్వంసం చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి...

నిర్మల్‌టౌన్: మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి నిర్మల్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపారు. భైంసా మండలం సిరాలకు చెందిన మహిళ, భైంసా పట్టణంలోని ఇమ్రాన్ ఒకేచోట పనిచేసేవారు. రెండేళ్ల క్రితం రాజస్థాన్ వెళ్లిన మహిళ భర్త తిరిగిరాలేదు. దీంతో ఇమ్రాన్ ఆమెను లొంగదీసుకునేందుకు యత్నించాడు. 2020, జూన్ 16న రాత్రి మహిళ ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించి లైంగికదాడికి యత్నించాడు. ప్రతిఘటించిన మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. సదరు మహిళ భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పున్నంచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీ.శ్రీనివాస్ పైవిధంగా తీర్పునిచ్చారు.

ముగ్గురు యువకుల రిమాండ్

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రిలో ఈ నెల 13న రాత్రి పంచశీల జెండాలను అవమానపర్చిన ఘటనలో గ్రామానికి చెందిన కొగురు అరుణ్, యాల్ల ఉదయ్‌కిరణ్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. దర్యాప్తులో ముగ్గురు యువకులు నిందితులుగా తేలడంతో బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అడవిలో మంటలు

కడెం: మండలంలోని నర్సాపూర్ సమీపంలో మంగళవారం రాత్రి కార్చిచ్చుతో అడవిలో మంటలు వ్యాపించాయి. అటవీ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నా అడవిలో మంటలు ఆగడం లేదు. సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతవుతున్నాయి.